# సరస్వతమ్మగారి తోట

"నాకు కుదరయ్యా. ఈ సన్మానాలకీ సత్కారాలకీ నన్ను చాలా దూరంగా ఉంచండి."

"అది కాదండి. మీలాంటి గొప్ప వ్యక్తి ఇక్కడ ఉండడం మా అదృష్టం. మీ గురించి తెలిసిన మా చైర్మన్ రామదాసు గారు స్వయంగా వెతుక్కుంటూ..."

ప్రొఫెసర్‌జగన్నాథంకి గుర్తొచ్చింది. అవును, ఓ వర్షంరోజు తెల్లవారు జామున డెబ్భయ్‌అయిదేళ్ల రామదాసు తనే నడుపుకుంటూ కార్లో ఇంటికి రావటం, సరస్వతమ్మ గారి భోగట్టా కనుక్కోవటం.

అంతకు రెండునెలలకు ముందే జగన్నాథంకి తొలిసారిగా సరస్వతమ్మ గారి గురించి తెలిసింది. అయితే, సరస్వతమ్మగారి పోరాటగాథలు తరచు ఉదంతాలుగా చెప్పినవాడు మాత్రం రామదాసే.

"పెదవాల్తేరులోనే ఉండిఇంతకాలం అజ్ఞాతంగా మీరు ఉండిపోవడం..." కళ్లద్దాల గడ్డం యువకుడు జాతి కృతఘ్నతానేరానికి పశ్చాత్తాపంతో మాట్లాడు తున్నాడు.

ఎనభైఏళ్ల సరస్వతమ్మగారు వయసులో భారీమనిషి అనిపించేట్టున్నారు. ఇప్పుడు కుంగిపోయిన శరీరంతో పొట్టి నవారుమంచం మీద శాంతంగా దిండుకు ఆనుకుని కూర్చుని వింటున్నారు. సన్మానం అన్నమాట చెవిన పడటంతో ఒంటిమీద తేళ్లూ జెర్రులూ పాకినట్టయి ఆమె ముఖం పక్కకు తిప్పుకున్నారు. అంతలోనే ఆమె తనలో తాను నవ్వుకున్నారు.

ఉదయం కురిసిన పెద్ద వర్షానికి సంతోషపడి పిట్టలు గోలగోలగా అరుస్తూ, ఆ తోటలోని చెట్లలో కొమ్మకొమ్మనా వాలి ఆడుకుంటున్నాయి. ఇంకా ఆకాశం మబ్బులతో తడి తడిగా బరువుగా ఉంది. చెట్లన్నీ స్నానం చేసి వచ్చినట్టు కళకళ్లాడు తున్నాయి.

ఆమె ముందు పరచిన జంపఖానా మీద కూర్చున్న ఆ ముగ్గురు యువకులు ఈ దేశాన్ని పాలించటానికే పుట్టామన్నట్టున్నారు. నీలంజీన్స్‌లో తెల్లదొరలా పచ్చగా, పొడుగ్గా ఉన్న రెండోవాడి చేతిలోని ఖరీదయిన కెమేరా, ఉన్నచోటునుండి కదలకుండా తనపని తాను చేసుకుంటున్నది.

సరస్వతమ్మగారు అప్పుడే స్నానం చేసి వచ్చినట్టున్నారు. ముడివేయ కుండా విడిచిన తెల్లటిజుత్తు తడితడిగా ఉంది. పొడుగుచేతుల ఖద్దరుచొక్కా తొడుక్కున్నారామె. ఖద్దరుచీర కట్టుకున్నారు. ఆమె గోడకి చేరగిలబడటానికి వీలుగా మంచం మీద పెద్ద దిళ్లు రెండున్నాయి.

"మీరు తప్పనిసరిగా ఒప్పుకోవాలి. వేదిక మీదికి వచ్చి మీరు మమ్మల్ని ఆశీర్వదించాలి. యువతరం మీ నుండి స్ఫూర్తి పొందుతుంది."

ఈ మాటలు ఆ కళ్లద్దాల యువకుడు ఇంగ్లీషులో అన్నాడు. తెలివైన కళ్లు. సంస్కారం ఉట్టిపడే గొంతు. అభిమానం ఉప్పొంగే మనసు, నమ్రత, విధేయత. ఇన్ని సుగుణాలు కనిపిస్తున్నా ఆ యువకుని ధోరణి ఇబ్బందిగా ఉంది సరస్వతమ్మ గారికి.

పాతకాలపు గోడగడియారం గంటలమోత. అయినా, ఎవరూ వినిపించు కున్నట్టు లేదు. 'ఇట్లాంటివి నాకు పడవయ్యా', చిన్న గొంతుతో అన్నారామె.

ప్రొఫెసర్‌జగన్నాథం తెల్లబోయాడు. నిజానికి ఇట్లాంటి కార్యక్రమం ఒకటి తలపెట్టినట్టు రామదాసు చెప్పినప్పుడు ప్రోత్సహించింది జగన్నాథమే. ప్రపంచం ఆమెని ఆరాధించాలన్నది అతడి ఆకాంక్ష. ఇప్పుడు సరస్వతమ్మగారి తిరస్కారం జగన్నాథంకి అవమానం. ఒకప్పుడు రాష్ట్రంలో కేబినెట్ హోదా మంత్రీ, రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడూ అయిన రామదాసు స్వాతంత్ర్య పోరాటకాలంలో సరస్వతమ్మ గారి తోటి కార్యకర్త కావడం వల్ల ఆమె పట్ల ఈ శ్రద్ధ అనుకున్నాడు జగన్నాథం. తెన్నేటి విశ్వనాథం, పట్టాభి సీతారామయ్య, టంగుటూరు ప్రకాశం పంతులు, దుర్గాబాయి దేశ్‌ముఖ్ వంటి అగ్ర శ్రేణి నాయకుల స్థాయిలో సరస్వతమ్మగారిని పొగిడాడు రామదాసు. భర్త సుందరం పంతులు గారితోపాటు స్వరాజ్యం కోసం ఆమె చేసిన త్యాగాలు ఇన్నన్ని కావు. వందలాది ఎకరాల తమ ఆస్తిని సుందరం పంతులు

రైతులకు పంచిపెట్టారు. ఆమె తల్లిగారు తన ఒంటి మీది అరవై, డెబ్బయ్ తులాల వజ్రాల నగలు గాంధీగారి స్వరాజ్య నిధికి నిలువు దోపిడీ ఇచ్చారు. సత్యాగ్రహ శిబిరాల్లో, ఆందోళనల్లో, కాంగ్రెస్ సభల్లో, సమావేశాల్లో, మహాసభల్లో ముందు వరసలో ఉండి పాల్గొనటంవంటి సరస్వతమ్మ గారి కుటుంబ స్వాతంత్ర్య పోరాట విశేషాలు గురించి రామదాసు నోట విన్నాడు జగన్నాథం.

రామదాసులాంటి పెద్దమనిషి తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని సరస్వతమ్మగారు తీసిపారేయటంతో ఆ వచ్చిన యువకులకన్నా ఎక్కువ ఇబ్బంది పడ్డాడు జగన్నాథం.

తన ఇంటికి నడక దూరంలో పెదవాల్తేరులో ఒక చిన్న తోటలో పాతకాలపు పెంకుటింట్లో ఉంటున్న సరస్వతమ్మ గారిని చూడటంతో జగన్నాథం జీవితంలో ఒకకొత్తఅధ్యాయం ప్రారంభమయింది. ఒక దేవతామూర్తిని చూసినంతగా గర్వపడ్డాడు. తన భార్య అన్నపూర్ణనీ, దగ్గర స్నేహితులనీ, తన పాతవిద్యార్థులనీ తీసుకుపోయి ఆమెని చూపించాడు. అందరికీ ఆమె అంటే గౌరవాభిమానాలు ఏర్పడ్డాయి. అది మొదలు జగన్నాథం ఆమెకి శిష్యుడూ, భక్తుడూ అయిపోయాడు. ఇప్పుడు అతడికి క్షణం తీరిక చిక్కడం లేదు. గడ్డం గీసుకోవటానికి కూడా ఓపిక లేకుండా పోయింది. దాంతో అతడు చూట్టానికి కొత్తగా కనిపిస్తున్నాడు. సెలవుదినం దొరికితే చాలు ఉదయమే వచ్చి ఆమె దగ్గర కూర్చుంటాడు. పైగా భార్య ఇప్పుడు ఊళ్లో లేదు. రెండో కూతురు కాన్పు సమయమని ఆగ్రా వెళ్లింది. పనిమనిషి ఉదయమే వచ్చి వంటచేసి పోతుంది. ఇంత తిని బయటపడితే జగన్నాథంకి సరస్వతమ్మ గారితో కావలసినంత కాలక్షేపం. ఆమె ఆనాటి పోరాట గాథలు చెపుతారు. జగన్నాథం వాటిని టేప్ చేసుకుంటాడు. మీరా భజనలు, దేశభక్తి గీతాలు ఆమె పాడితే వినటం ఒక భాగ్యం. కల్లు మానండోయ్ బాబు కళ్లు తెరవండి, మాకొద్దీ తెల్ల దొరతనం, సారే జహాఁసే అచ్ఛా — ఆమె గొంతులో వేదమంత్రాల్లా ధ్వనిస్తాయి. ఆ పాటలు ఆ రోజుల్లో తెచ్చిన చైతన్యం గురించి వింటుంటే మనసు ఉప్పొంగి పోతుంది. ఆనాటి దేశభక్తుల గురించి ఆమె చెప్పే కథలు కంటనీళ్లు తెప్పిస్తాయి. ఆ కథలు జాతి భద్రం చేసుకోవలసిన చరిత్ర. సరస్వతమ్మగారి జ్ఞాపకాల్లోంచి చరిత్రఘట్టాలు పుటలు పుటలుగా బయటపడుతున్నాయి.

పదేళ్ల దుర్గ పళ్లెంలో గాజుగ్లాసుల్తో టీ పట్టుకుని వచ్చి అక్కడున్న అందరికీ ఇచ్చి వెళ్లింది.

ఆ ఇంటికి ఆగ్నేయంగా ప్రహరీగోడకానుకుని ఉన్న పశువులపాకను

సుందర్రావు ఊదుస్తున్నాడు. ఆ పాక ముందున్న పనసచెట్టు కింద రెండు పాడిగేదెలు కట్టుమీదున్నాయి. వాటిచుట్టూ రెండుదూడలు ఆడుకుంటున్నాయి. ఎదురుగా తూర్పు వేపు ఆకాశంలోకి విచ్చుకున్న పవ్వుల్లా పొడవాటి కొబ్బరిచెట్లు సముద్రపుగాలికి ఊగుతున్నాయి. ఆ తోట నిండా దట్టంగా రకరకాల చెట్లు. పది పన్నెండు మామిటి చెట్లు. నేల మీద పరచుకున్న కొమ్మలతో అల్లుకుపోయి పదున్న ఎన్నో జీడి చెట్లు. కాయలతో ఉన్న మునగ, సపోటా చెట్లు. బావి దగ్గర గెలలతో అరటి పొద. పిచ్చిగా పెరిగిన పూల మొక్కలు. బావి దగ్గర బట్టలు ఉతుక్కుంటున్న రంగాయమ్మ ఆకాశంలో మేఘాలని చూసి వర్షం మళ్లీ ఇప్పుడప్పుడే రాకపోవచ్చులే అన్న భరోసాతో తన పని చేసుకుంటున్నది. రిక్షావాడు గేదెల కోసం తెచ్చిన పచ్చిగడ్డి మోపు పాకలో వేసి వెళ్లిపోయాడు.

దుర్గ లోపలికి వెళ్లి మరో రెండు గ్లాసుల్లో టీ పట్టుకుని అటుపాక వేపు వెళ్లింది.

ఇవేళ జగన్నాథం గంట కిందటే ఇంకా వర్షం కురుస్తుండగానే వచ్చాడు. గొడుగు ఉన్నా నిండా తడిసిపోయాడు. ఈ యువకులు ఇవేళ వస్తారని కాదు, రంగాయమ్మ గొడవ పడలేక వచ్చాడు. వారం దినాల కిందట రంగాయమ్మ పదిహేనేళ్లు కాపురం చేసిన మొగుణ్ణీ, ముగ్గురు పిల్లల్నీ తన ఆస్తిసర్వస్వాన్నీ వదిలేసి పారిపోయి ఏడ్చుకుంటూ ఇక్కడకు వచ్చేసింది. రంగాయమ్మ ఆచూకీ తెలుసుకుని ఆ మొగుడు అన్నవాడు తన స్నేహితులను ఇద్దర్ని రాయబారం పంపించాడు. భర్త ఇవేళ గూండాలని పంపిస్తాడని ఆమె భయం. వాడు ట్రేడ్ యూనియన్ నాయకుడు. వాడి చేతుల్లో చాలా మంది గూండాలున్నారని ఆమె ఆందోళన. బాబాయి, మీరు రేపు ఉదయమే రావాలి బాబాయి — అని నిన్న చాలా ప్రాధేయపడింది. ఆ గొడవ ఒక పక్క సాగుతూనే ఉంది. తన పిల్లల్ని ఎట్లాగైనా ఎత్తుకురావాలని, ఆ కిరాతకుడి చెరనుండి పిల్లల్ని కాపాడుకోవాలని రకరకాల పథకాలు వేస్తున్నది. "పిల్లలు వాళ్లే తల్లి కోసం వెతుక్కుని వస్తారు కొన్నాళ్లు ఓపిక పట్టమ్మా" అంటే, పిల్లల్ని విడిచిపెట్టి ఎట్లా బతకాలి బాబాయి అంటుంది, ఏడుస్తుంది. అదేదో జగన్నాథం చేతిలో పని అన్నట్టు.

"ఈనాటి ప్రభుత్వం — దేశ రాజకీయాలు — స్వరాజ్యం కోసం పోరాడిన నాటి మీ స్వప్నాల సమాజం కాదు. ఇదేమి స్వరాజ్యం — దొంగల రాజ్యం — అంతర్జాతీయ మాఫియా ముఠా రాజ్యం — స్విస్ బేంకుల రాజ్యం — వీళ్లు నాయకులేనా — ప్రజల కన్నీళ్లు, కష్టాలు వీళ్లకు తెలుసునా — ప్రజాశ్రేయస్సు కోసం

పాటుపడేవాళ్లేనా — అని ఎన్నో సందేహాలు — సమాజం మరింత పతనం కాకముందే..."

దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టుగా ఉంది సరస్వతమ్మగారికి. రామదాసు పేరు వాళ్లనోట విన్నప్పుడే వాళ్ల నిజస్వరూపం తెలిసిపోయింది ఆమెకి. 'నాకు ఇష్టం లేదయ్యా.' మరోసారి అన్నారామె. చేత్తో టైమ్, న్యూస్‌వీక్ పత్రికలు పట్టుకున్న తెల్లలాల్చీపైజామా గడ్డముక్కు యువకుడు పత్రికపుటలు తిరగేస్తున్నవాడల్లా ఆమె మాట విని మరోసారి ఆమె ముఖంలోకి చూశాడు. రుషుల గురించి పుస్తకాలల్లో చదివిన వర్ణనలు ఆమె ముఖంలో వెలుగు నీడల్లా కనిపించాయి. ముడతలు పడిన చర్మంలో తరగని మాతృత్వశోభతో సరస్వతమ్మగారు ఈసారి కనిపించారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంతో తలపడి, లాఠీదెబ్బలు తిని, జైలుశిక్షలు అనుభవించిన సరస్వతమ్మగారు ఈమేనా? పద్ధెనిమిది, ఇరవైఏళ్ల చిన్న వయసులో ఏళ్ల తరబడి పోరాటంలో పాల్గొన్న నాయకురాలు ఈమేనా? గాంధీమహాత్ముడు స్వరాజ్య నిధి కోసం వచ్చినప్పుడు అరవై డెబ్బయ్ తులాల వజ్రాల నగలు నిలువుదోపిడీ ఇచ్చిన తల్లి అడుగుజాడల్లో తమ యావదాస్తిని రైతులకు పంచిపెట్టిన త్యాగమూర్తి ఈమేనా? ఈ వృద్ధమూర్తేనా? కాలం కెరటాలు ఘనీభవించినట్టున్న ముఖం మీది వయసు ముడతల చాలుల్లో స్వాతంత్ర్య కాంక్ష — ఆ వెలుగు — తనకేమీ సంబంధం లేదన్న వైరాగ్యభావం — ఆమె ఆగ్రహం — అసహనం — ఎందుకామె తమ ఆహ్వానం తిరస్కరిస్తున్నదో అర్థంకాని విచికిత్సలో పడ్డాడు.

కళ్లద్దాల గడ్డం యువకుడు చెపుతూనే ఉన్నాడు. దేశానికి ఎప్పుడు ఏ ప్రమాదం దాపురిస్తుందో అన్న ఆందోళనతో మాట్లాడుతున్నాడు. ఇవేళ సోవియట్ యూనియన్ పరిస్థితి — ఇరాక్ పరాభవం — యుగోస్లావియా విచ్ఛిత్తి, కాశ్మీర్‌లో తీవ్రవాదుల చిచ్చు పెట్టడానికి పన్నుతున్న వ్యూహాలు — తన భయాలు చెప్పుకుంటున్నాడు.

"ఈనాడు జాతికి కావలసింది వెన్నెముకగల యువతరం. శత్రువును మట్టి కరిపించగల దేశభక్తులు. మీ పోరాటస్ఫూర్తిని భుజాన మోసే కొత్తతరం, మీ వారసత్వానికి యోగ్యులయిన యోధులు — తప్పదు, మీరు రావాలి."

వాళ్లతో మాట్లాడడం దండుగ అని సరస్వతమ్మగారు ముఖం మరోసారి పక్కకు తిప్పేసుకున్నారు. జగన్నాథంకి దిక్కు తోచలేదు. ఇవేళ సుందర్రావు పనిమీద ప్లీడర్ దగ్గరకు పోవాలి. సుందర్రావు మీద కాలేజీ యాజమాన్యం క్రిమినల్ కేసు పెట్టింది. రెండేళ్ల క్రిందట కాలేజీ మేనేజ్‌మెంట్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన సమ్మెకు,

హింసాకాండకు కారణం ఫిజిక్స్ లెక్చరర్ సుందర్రావేనని అతణ్ణి అరెస్టు చేయించారు. ఉద్యోగం నుండి తీసేశారు. మేనేజ్‌మెంట్‌లోని పెద్దతలకాయలు న్యాయాన్ని తలకిందులు చేయగల దిట్టలు. దాంతో జగన్నాథంకి ఆందోళన. తన శిష్యుడు ఓ క్రిమినల్ లాయర్ ఉన్నాడు. అతడి దగ్గరకు సుందర్రావును తీసుకుపోవాలి. రంగాయమ్మకు ధైర్యం చెప్పి మధ్యాహ్నం అటు వెళ్లాలి.

ఇక్కడ ఈ యువకులు సరస్వతమ్మగారిని విడిచి పెట్టేట్టు లేరు. జగన్నాథం దృష్టిలో ఆ యువకులు బుద్ధిమంతులే. ముఖ్యంగా ఆ కళ్లద్దాల యువకుడు మోతిలాల్, విశ్వవిద్యాలయం విద్యార్థి నాయకుడిగా మన్ననలు పొందినవాడు. నీలం జీన్స్ యువకుడు తన విద్యార్థే. ఢిల్లీ యూనివర్సిటీలో పిహెచ్.డి చేశాడు. అట్లాంటి ప్రతిభావంతులైన యువకులను తానే ఇక్కడకు రప్పించి వాళ్లను తిట్టిస్తున్నట్టు బాధపడ్డాడు జగన్నాథం.

అంతలో ఆరేడుగురు పడుచు వయసు ఆడపిల్లలు... అంతా పద్దెనిమిది, పాతికేళ్ల మధ్య వయసు వాళ్లు, గుళ్లోకి వచ్చినట్టుగా రంగురంగుల కొత్తబట్టలతో సపోటా చెట్టు కిందినించి, అరటిపాద పక్కనించి, పూలమొక్కల మధ్యనించి రెండు పెద్ద పెద్ద వెండి పళ్లేలతో పూలూ, పళ్లూ, మిఠాయీ పట్టుకుని బిలబిలా వచ్చారు. వాళ్లలో పెళ్లి అలంకరణలో ఉన్న ఓ అమ్మాయి తన చేతిలోని పళ్లేన్ని సరస్వతమ్మ గారికి ఇచ్చి వంగి ఆమె పాదాలకు నమస్కరించింది. మిగిలిన యువతులు కొందరు పాదాలు ముట్టుకుని, కొందరు చేతులు జోడించి ఆమెకు నమస్కరించారు.

"నిర్మలా, చక్రపాణి ఏమయిపోయాడే, నీతో తీసుకురాలేదు."

సరస్వతమ్మగారు నిర్మలను తన పక్కనే కూర్చోబెట్టుకుని తల నిమురుతూ గారాబంగా అడిగారు. సరస్వతమ్మగారి వేళాకోళం అర్థమై నవ్వేసింది నిర్మల.

వాళ్లది ప్రేమపెళ్లి. అందులోనూ కులాంతరం. అయినా, జరిగింది. నిర్మలా వాళ్లది సంపన్న కుటుంబం. నిర్మల ఎమ్. ఎస్ సి చేసింది. అబ్బాయి చక్రపాణి అనాథశిశువుగా సరస్వతమ్మగారి దగ్గర చేరి అక్కడే పెరిగాడు. పెళ్లి విషయంలో గొడవ పడతారనకున్నారు. సరస్వతమ్మగారు పట్టించుకోవటంతో పూలదండలపెళ్లి జరిగింది. అమ్మాయి తలిదండ్రులు పెళ్లికి రాలేదు. తాతగారు వచ్చి నిలబడ్డారు. ఆయనే ఇప్పుడు పట్టుపట్టి అన్ని లాంఛనాలు జరిగేట్టు చూస్తున్నారు. చక్రపాణి ఇప్పుడు శ్రీకాకుళం జిల్లాలో, సముద్రం ఒడ్డు మారుమూల ఊళ్లో ఉపాధ్యాయుడు. ఇవేళ కొత్తదంపతులు అక్కడకు వెళ్లిపోతున్నారు.

"నిర్మలా, ఈ మిఠాయి నీ చేత్తో అందరికీ పెట్టు. ఆ అబ్బాయిలకు ముందు పెట్టు, వాళ్లు వెళ్లిపోవాలి" అని తన కోసం తెచ్చిన మిఠాయిని తన చుట్టూ చేరిన అందరికీ పంచిపెట్టించారామె. తాగిన టీ గ్లాసులను తీసుకుపోవటానికి వచ్చిన దుర్గ పెత్తనం చేసింది. ప్లేట్లు తీసుకురావటం, అవి అందరికీ అందించటం, నిర్మల చేత, సరస్వతమ్మ గారి చేత తినిపించటం, ఇంట్లో వంటపనిలో ఉన్న అమ్మకీ, అమ్మకి సాయం చేస్తున్న రాజమ్మమ్మకీ, ఉతుక్కున్న బట్టలు ఆరేసి వచ్చిన రంగాయమ్మ అత్తయ్యకీ, బావి దగ్గర స్నానం చేసి, తడి బట్టలు పిండుకుని వచ్చిన సుందర్రావు బాబాయికీ, జగన్నాథం తాతయ్యకీ దుర్గే మిఠాయి ఇచ్చింది. తర్వాత అందరికీ స్టీలు గ్లాసుల్లో మంచినీళ్లు తెచ్చి పెట్టింది.

"దుర్గా, మీ అమ్మని పిలువు" అని మిఠాయి తింటున్న దుర్గకి చెప్పి "కూర్చోండర్రా" అని నిర్మలతో వచ్చిన ఆడపిల్లలను సరస్వతమ్మగారు తన చుట్టూ కూర్చో బెట్టుకున్నారు. ఆ రెండో పళ్లెంలో పళ్లూ, మిగిలిన మిఠాయీ నిర్మలే స్వయంగా తీసుకుపోయి లోపల పెట్టి వచ్చింది.

"నిర్మలా, మీ ఊరు నన్నెప్పుడు తీసుకుపోతావే?"

నిర్మల వాళ్లకు కార్లున్నాయి. సరస్వతమ్మగారు ఎప్పుడంటే అప్పుడే పోవచ్చు. కాని, ఆ అడగటం నిర్మలను ఆటపట్టించాలని. ఆ సంగతి నిర్మలకు తెలుసు. అందుకే నవ్వేసి ఊరుకుంది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా సరస్వతమ్మగారు ఈ తోటలో, ఈ పాతకాలపు పెంకుటింట్లో ఉంటున్నారు. ఆమె బయటికి పోవటం తక్కువ. భర్త సుందరం పంతులుగారు చనిపోయిన ఈ ఇరవైఏళ్లలో మూడునాలుగుసార్లు మాత్రమే ఎక్కడికన్నా వెళ్లారేమో. అదన్నా ఎవరైనా ఆపదల్లో ఉన్నారని తెలిసినప్పుడు, పెద్ద దిక్కుగా తాను తప్పక నిలబడాలనుకున్నప్పుడు మాత్రమే. తమ స్వాతంత్ర్య పోరాటానికి అవరోధమని సంతానం కలగకుండా జాగ్రత్తపడిన సరస్వతమ్మగారికి ఇప్పుడు ఇంటి నిండా పిల్లలే.

అట్లాంటి పిల్లే దుర్గ. ఆపదల్లో ఉన్నవారు వస్తారు. అక్కడే ఉండిపోతారు. దుర్గ తల్లి పార్వతి తొమ్మిదేళ్ల కిందట అట్లాగే వచ్చింది, పసిపాపతో. అట్లా ఎందరెందరో, పారిపోయి గుండెడు దుఃఖంతో వస్తారు. దుఃఖం చల్లారిన తర్వాత కొందరు రాజీపడి, తమ వాళ్లతో తిరిగి వెళ్లిపోతారు. కొందరికి సమస్యలు పరిష్కారం అవుతాయి. కొందరికి ఏ దిక్కూ ఉండదు. ఏ దారీ తోచదు. ఇక్కడే ఉంటారు. అరవై ఏళ్ల రాజమ్మ అట్లాంటిదే. ఏడాది కిందట వచ్చింది. కొడుకులు, అల్లుళ్లు పెద్ద పెద్ద

ఉద్యోగాల్లో ఉన్నారు. వస్తారు, ఏడుస్తారు, తమతో రమ్మని బతిమాలుతారు. అయినా, రాజమ్మపోదు.

"అబ్బాయిలూ, ఇంక మీరు వెళ్లవచ్చు."

"మళ్లా రావద్దు, తెలిసిందా" అంది దుర్గ.

దుర్గ మాటలు అట్లాగే ఉంటాయి. జగన్నాథం నోరు తెరిచాడు. బడిలో పంతుళ్లు చదువు చెప్పటం లేదని, కొడతారని బడి మానేసి సుందర్రావు బాబాయి దగ్గర చదువు చెప్పించుకుంటున్నది దుర్గ. బడికి పోను — అని దుర్గ మొండికేస్తే ఎంతో సంతోషించారు సరస్వతమ్మగారు. దుర్గని అట్లాగే పెంచాలనుకున్నారామె. 'నువ్వు బడికి పోవద్దులే. నా దగ్గర పాటలు నేర్చుకో. బాబాయి దగ్గర పాఠాలు నేర్చుకో. అమ్మ దగ్గర వంట నేర్చుకో' అని దుర్గకి తాళం వేస్తారు సరస్వతమ్మగారు.

ప్రొఫెసర్‌గారు జోక్యం చేసుకుంటే సరేలే అంటారని ఎదురుచూస్తున్న స్విస్ బ్యాంకుల వారసుల్లాంటి ఆ యువకులకు ఆ చిన్న పిల్ల దుర్గ మాట కొరడాలా తగిలింది. వచ్చిన ఆడపిల్లలతో నవ్వుతూ, నవ్విస్తూ మాట్లాడుతున్న సరస్వతమ్మగారు తమను పొమ్మనటం ముఖాల మీద ఉమ్మినట్టుగా ఉంది.

దుర్గ తల్లి పార్వతి వచ్చింది. కళకళలాడుతున్న నవ్వుముఖం.

"పార్వతీ, ఈ కొత్త పెళ్లి కూతురుకు ఏం పెడతావో పెట్టు. తిరిగి ఎప్పుడొస్తారో కనుక్కో. రాత్రినించి ఆ చక్రపాణి కనిపించడం లేదు చూడు" అని సరస్వతమ్మగారు నిర్మలతో, వచ్చిన ఆడపిల్లలతో ముచ్చట్లు పెట్టుకున్నారు.

"మీరు రాకపోతే వేదిక మీద మీ ఫోటోను పెట్టుకునన్నా ఈ సన్మానం జయప్రదం చేసుకుంటాం" అని మీరు రాకపోతేమాత్రమేం అన్నట్టుగా లేచిన భావిభారతభాగ్యవిధాతలయిన ఆ యువకులు ఆమెకి మరోసారి వీడ్కోలు నమస్కారం చేసి వెళ్లి పోయారు. గేటు దగ్గర రోడ్డుమీద ఇంతసేపు కాపలా కాసిన ఎర్ర కారు అక్కడినించి మాయమైంది.

* * *

స్వాతంత్ర్యపోరాటం ఉధృతంగా సాగుతున్న మహోజ్జ్వల ఘట్టం. మరోసారి చెరసాల పాలు కాకుండా రహస్య జీవితం సాగిస్తూ ఉద్యమంలో పాల్గొంటున్న కాలం. ఇచ్ఛాపురం దగ్గర్లో ఓ మారుమూల పల్లెటూళ్లో ఓ చిన్న రైతు ఇంట్లో తలదాచుకుంటున్నాం. ఆ రైతు కూతురు మాణిక్యం పదహారేళ్లది. అప్పటికే పెళ్లయింది. ఓ రాత్రి నా ఆరోగ్యం చెడిపోయింది, వాంతులు. ఆరోజే ఉదయం

మాణిక్యం తల్లీ, తండ్రీ దగ్గర బంధువుల ఓ పెళ్లికి వేరే ఊరు వెళ్లారు. రెండు మూడు రోజుల తర్వాతగాని వాళ్లు తిరిగిరారు. మాణిక్యం వాళ్లతోపాటు వెళ్లేదే కాని, నా కోసం ఇంట్లో ఉంచారు. నా వాంతులు తగ్గలేదు. దాదాపు పది, పన్నెండయ్యాయి. అర్ధరాత్రి, రెండుమైళ్ల దూరంలో ఆయుర్వేద వైద్యుడున్నట్టు ఎవరో చెప్పారు. ఇద్దరు కుర్రాళ్లను పంపించింది. రోడ్లు, సైకిళ్లు కూడా లేని రోజులు. కాలి నడకన వెళ్లాలి. ఆ వైద్యున్ని తీసుకొని వాళ్లు గంటలో వచ్చారు. అప్పటికి నాకు దాదాపు ఇరవై వాంతులయ్యాయి, నీరసం. చేతులూ, కాళ్లూ కొంకర్లు పోతున్నాయి. వైద్యుడు వచ్చీరావటంతోనే ఓ మోతాదు మందు తేనెతో ఇచ్చాడు. అది పని చేయడం మొదలుపెట్టింది. వేకువజాము వరకూ ఉండి వైద్యునితో సహా వాళ్లు చేసిన సేవ మరచిపోలేను. నాకు మాణిక్యం ప్రాణదాత.

మేము పోలీసుల కంటపడితే ఎంత ప్రమాదమో మాకు ఆశ్రయం ఇచ్చిన వాళ్లకు బొత్తిగా తెలీదు. వాళ్లు మా మూలంగా కష్టాల పాలు కాకూడదన్నదే మా జాగ్రత్త. ఏ ఇంటా వారం పదిరోజుల కన్నా ఎక్కువ రోజులు ఉండేవాళ్లం కాదు. కొన్నిసార్లు ఒకటి రెండు రోజులే. కానీ, నా అనారోగ్యం. అప్పట్లో పంతులుగారు విశాఖపట్నంలో ఉద్యమంలో నిండా మునిగి ఉన్నారు. ఆయనకు నా అనారోగ్యం గురించి తెలియజేయరాదని, త్వరలోనే నేను మళ్లీ నా పనులు చేసుకోగలుగుతానని ధైర్యం. కొన్ని రోజుల్లోనే ఆయన అరెస్ట్ అయ్యారు. ఆయన్ని రాయవెల్లూరు తరలించారు.

ఆ ప్రాంతంలో సుందర్రావు నాయకత్వం. ఆయనంటే ప్రజల్లో ప్రేమాభిమానాలు. ఆ పేరు చెప్పుకుంటేనే చాలు రైతు కుటుంబాల్లో ఆశ్రయం దొరికేది. రైతులు సాగుచేస్తున్న ఆ భూములన్నీ ఆ కుటుంబానివే. కొన్ని వందల ఎకరాలు. ఇసుక భూములు. అప్పుడప్పుడే కొబ్బరి తోటలు లేస్తున్నాయి. కార్యకర్తలు, నాయకులు జైళ్లలో మగ్గుతున్నా, ప్రజలు ఉద్యమాన్ని సాగిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ముందు పికెటింగులు, పోలీస్ స్టేషన్‌ల మీద దాడులు, బ్రిటిష్ పాలకులకు తొత్తులయిన మొఖాసాదారుల మీద పోరాటాలు, జాతీయపతాకాన్ని ఎగురవేయడాలు, వందేమాతరం, భారతమాతాకీ జై, మహాత్మా గాంధీకీ జై నినాదాలు, పోలీసుల తుపాకులకు నేలకొరుగుతున్న దేశభక్తులు, ఉద్యమకారులతో నిండిపోతున్న జైళ్లు, నాయకత్వం పట్టుతప్పి పెల్లుబుకుతున్న ఆందోళనలు. స్వాతంత్ర్యోద్యమ ప్రవాహం కట్టలు తెగి వెల్లువై ప్రవహిస్తున్న రోజులు.

అట్లాంటి గడ్డురోజుల్లో మాకు ఆశ్రయం ఇచ్చి, సేవ చేసి, తిండి పెట్టి అన్నివిధాలా మాకు సహాయపడుతున్న ఆ రైతుకుటుంబం నా దృష్టిలో పోరాటయోధులే. ఆ ముగ్గురినీ ఎప్పటికీ మరచిపోలేను. వాళ్ల ప్రేమ అట్లాంటిది. ఆ ఊరు అందం కూడా అట్లాంటిదే. ప్రతిఇంటిముందు పూలమొక్కలు. పెరట్లో కూరగాయల పాదులు. కొబ్బరి తోటలు — మధ్య మధ్య మామిడి, జీడి, అరటి తోటలు. తోటల మధ్య చిన్న చిన్న ఊళ్లు. తోటల్లో ఇళ్లు ప్రశాంతంగా ఉండేవి. అంత అందమైన ఊళ్లు ఇప్పటికీ నేను చూడలేదు. నీలం ఆకాశం గొడుగు కింద పచ్చటి తోటల ఊళ్లవి. పక్షుల అరుపులు. కొబ్బరి తోటల గాలులు. రాత్రిపూట వినిపించే సముద్రపు హోరు. వర్షాకాలం. రహస్య జీవితం. రాత్రిపూట వచ్చి కలిసిపోయే అజ్ఞాత కార్యకర్తలు. మాతోపాటే మాణిక్యం, ఆమె తల్లీ తండ్రీ నిద్రాహారాలు లెక్కచెయ్యకుండా పని చేసేవారు. అర్ధరాత్రిపూట లేపినా — వచ్చిపోయే కార్యకర్తలకు వండి పెట్టేవాళ్లు.

ఆ రోజుల్లో సుందర్రావు అనుచరుడుగా ఓ కార్యకర్త ఆ ఊళ్లోనే వేరే ఇంట ఆశ్రయం సంపాదించాడు. హత్యానేరానికి సంబంధించిన పోలీస్ కేసులో తప్పించుకుని తిరుగుతూ, ఖద్దరు దుస్తులూ, గాంధీ టోపీ పెట్టుకుని కార్యకర్తగా చలామణి అవుతున్నాడని, వాడిని తొలగించాలని కొందరి ఫిర్యాదులు. కానీ, ఎవ్వరూ పట్టించుకోలేదు. స్వరాజ్య మహోద్యమ రథ చక్రాల కింద పడి నలిగి కొత్తజాతి రూపొందుతుందని ఒక వాదన. మనుషుల పరివర్తనకు ఇదొక అవకాశం కదా అని ఉదార భావం, క్షమాగుణం.

ఓ రోజు ఆ ఊళ్లో ఏదో పండుగ. ఆ సందర్భంగా హరికథా కాలక్షేపం. హరిదాసు ఆదిభట్ల నారాయణ దాసుగారి శిష్యుడని చెప్పారు. మేముంటున్న వీధిలోనే, ఉత్తరగోగ్రహణం కథ. హరిదాసు అద్భుతమైన పద్యపఠనంతో, గానంతో, నాట్యంతో హాస్యంతో రక్తి కట్టించి ప్రేక్షకులను తన్మయం చేశాడు. పాండవుల అజ్ఞాతవాస ఘట్టం. విరాటుని కొలువు. స్వరాజ్య ఉద్యమాన్ని మధ్య మధ్య ఉదహరిస్తున్నాడు. మాణిక్యంతోపాటు మెలకువగా ఉండి కథ విన్నాను. హరికథ ముగిసేసరికి అర్ధరాత్రి దాటిపోయింది.

వేకువజామున ఇంటి అరుగుమీద నిద్రపోతున్న మాణిక్యం గగ్గోలుపెట్టి అరవడం వినిపించింది. ఆమెకు దగ్గర్లోనే నిద్రపోతున్న నాకు మెలకువ వచ్చింది. తాటాకు ఇళ్లు. ముంజూర్లను రాసుకుంటూ ఒక మనిషి పారిపోతున్న చప్పుడు

వినిపించింది. దొంగ, దొంగ అని లేచి ఇద్దరు ముగ్గురు ఆ చీకట్లో వెంబడించారు. దొంగ దొరకలేదు. చీకటి రాత్రులు. దొంగను పట్టుకోవాలని పరుగెత్తిన వాళ్లు, వాడు తోటల్లోకి పారిపోయాడని వెనక్కి వచ్చేశారు.

దొంగ ఏమీ ఎత్తుకుపోలేదని సంతృప్తి చెందారు. అయితే, ఆ ఉదయం మాణిక్యం చెప్పిన రహస్యం ఏమిటంటే, రాత్రి జరిగినది దొంగతనం కానేకాదట. మాణిక్యం మీద బలాత్కార ప్రయత్నం చేశాడట. మాణిక్యం వాడిని గుర్తు పట్టిందట. ఖద్దరు వేషంలో తిరుగుతున్న ఆ నకిలీ కార్యకర్తే. వాడే ఈ రామదాసు.

ఢిల్లీ ఎర్రకోటబురుజుల మీద జాతీయపతాకం ఎగరక ముందే సుందర్రావు చనిపోయాడు. నిద్రాహారాలు ఎరగని పోరాటం, వైద్య చికిత్సకు సైతం వ్యవధి చిక్కని ఉద్యమ జీవితం ఆ దేశభక్తుని ఆరోగ్యాన్ని తినేశాయి. స్వాతంత్ర్యసిద్ధితో పోరాటం ఆగిపోయింది. పదవీ వ్యామోహానికి దూరంగా ఉండాలని, ఘనమైన త్యాగాలను పెట్టుబడిగా భావించరాదని, ఫలాపేక్షకు బలికారాదని ఒకవర్గం మహాత్ముని అడుగుజాడల్లో దేశపునర్నిర్మాణ కార్యక్రమాలను చేపట్టింది. గ్రామపునరుద్ధరణ, ఖద్దరు, హిందీ ప్రచారం, హరిజనోద్ధరణ, వయోజనవిద్య, గ్రామపరిశ్రమలు మొదలయిన ఆదర్శాల సాధన కోసం కృషి చేయడం మొదలుపెట్టింది. ఆ నిర్మాణ కార్యకలాపాలు మమ్మల్ని ఆకర్షించాయి. పాలనాధికారం చివరకు రామదాసుల చేతిలో పడింది. ధనార్జన, భోగలాలసత, పదవీకాంక్ష, బంధుప్రీతి, ఆశ్రితప్రీతి, కుట్రలు — మొదలయ్యాయి. టంగుటూరు ప్రకాశంపంతులు, తెన్నేటి విశ్వనాథం వంటి వారు కూడా ఈ వ్యూహాలకు తట్టుకోలేక పోయారు. మహాత్ముని పేరు స్మరించడానికి సైతం యోగ్యత లేనివాళ్లు నాయకులయ్యారు. దాని ప్రభావమే దేశాన్ని కొల్లగొట్టి విదేశీ బ్యాంకుల్లో దాచుకోవడం. ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేరన్నారు అని ముగించారు సరస్వతమ్మగారు.

జగన్నాథం వెన్నులో వణుకు పుట్టింది.

జగన్నాథంకి గుర్తొచ్చింది, రామదాసు ఘనత గురించి, పలుకుబడి గురించి. ఒక మనుమడిని పారిశ్రామికవేత్తను చేశాడు. ఇంకొక మనుమడిని రాజకీయాల్లో ప్రవేశపెట్టాడు. తనేమో స్వాతంత్ర్య సమరయోధుడు. ఆ హోదాలో విశాఖపట్నం చుట్టుప్రక్కల పదిఎకరాల ప్రభుత్వభూమిని సంపాదించాడు. దాన్ని తర్వాత ఇళ్లస్థలాలుగా అమ్ముకున్నాడు. రైతుల సాగులో ఉన్నాయన్న పేరుతో, అధికారులతో కుమ్మక్కై, రైతుల పేరిట పట్టాలు సంపాదించాడు. తన వాటా తాను తీసుకున్నాడు.

కోట్లు సంపాదించాడు. ముఠాలు కట్టాడు, పార్టీలు పెట్టాడు, జండాలు మార్చాడు. అన్నీ తెలిసినవే, అందరికీ తెలిసినవే. సరస్వతమ్మగారు చెప్పేవరకు రామదాసులో కనిపించని చెడు ఇప్పుడు కనిపించసాగింది. రామదాసు సంపాదించిన కోట్లకు ఇప్పుడు కోరలు కనిపించసాగాయి.

"రామదాసు వారసులు మాఫియా ముఠా అవుతారే తప్ప ప్రజాసేవకులు కాలేరు. వాళ్లు బుద్ధిమంతులే, వాళ్లు చేస్తున్నది మంచిపనే అంటే ఎట్లా నమ్మమంటావ్ జగన్నాథం?"

రామదాసు విశ్వరూపం ఇప్పుడు ప్రొ. జగన్నాథం కళ్లముందు సాక్షాత్కరించింది.

తాను తెచ్చిన ప్రమాదం గురించి ఇప్పుడు జగన్నాథానికి మెల్లమెల్లగా బోధపడసాగింది. కీర్తి ప్రపంచానికి దూరంగా, ప్రశాంతంగా బతుకుతున్న సరస్వతమ్మగారిని ఈ యువకులొచ్చి ఒత్తిడి తేవటానికి తనే కారణం.

"రామదాసు దృష్టి — నాలుగున్నర దశాబ్దాల పాటు ఎప్పుడూ లేనిది ఇప్పుడు హఠాత్తుగా సరస్వతమ్మ మీద పడడానికి కారణం చెప్పనా. మనిషి నెత్తురు రుచి చూస్తే పులి ఇంక మనుషుల్ని వదలదట. ఇప్పుడు భూముల సంపద రుచి చూశాడు. ఇదుగో ఈ సన్మానాల మాయతో ఈ తోట మీద పడడానికి కుట్ర. ఈ తోట విలువ రూపాయల్లో వాడికి తెలుసు. ఏ ట్రస్టీ పేరుతోనే ఇందులో చేరి, ఎన్నో అంతస్తులతో ఏ వాణిజ్య సముదాయమో కట్టించి కోట్లాది రూపాయలు సంపాదించుకోవచ్చునన్న ఎత్తుగడ. ఈ విషప్పురుగు కన్ను దీని మీద పడుతుందని నేనెప్పుడూ అనుకోలేదు."

స్వాతంత్ర్య ఉద్యమంలో తన సర్వస్వం త్యాగం చేసిన ఒక మహావ్యక్తిని జాతి మరచిపోయిందనే ఆవేదనతో జగన్నాథం ఆమె ఉనికి గురించి నలుగురికీ చెప్పాడే తప్ప, కొండచిలువ ఈ ఇంట్లో ప్రవేశిస్తుందని ఊహించలేదు. పండు కోసం చెట్టెక్కితే పాము ఎదురయింది అన్నట్టుంది జగన్నాథానికి.

ఇప్పుడు సరస్వతమ్మగారిని చూట్టానికి పెద్దలు చాలామంది వస్తున్నారు. పూలగుత్తులు, నేతి మిఠాయి పేకెట్‌లు తెచ్చి ఇస్తున్నారు. సరస్వతమ్మ గారి కంచువిగ్రహం నగరంలో ఒక పెద్దకూడలిలో పెట్టాలని ఒక బృందం కార్యక్రమం చేపట్టి నిధులువసూలు చేస్తున్నది. సుందరం పంతులు, సరస్వతమ్మ దంపతుల ఆదర్శప్రాయమైన దేశభక్తి గురించి జీవితవిశేషాలతో, ఛాయా చిత్రాలతో పత్రికల్లో వ్యాసాలు వస్తున్నాయి. అయితే, ఈ మాయ వెనుక పొంచి ఉన్న ప్రమాదం, భీతి జగన్నాథాన్ని కల్లోలపరచసాగింది. రామదాసు చేతిలో ఉన్న అనేక మారణాస్త్రాలలో

ఏది సరస్వతమ్మగారి మీద పడుతుందో నన్న భయం పట్టుకుని అతణ్ణి ఇప్పుడు పీడిస్తున్నది. దాన్ని ఎట్లా ఎదుర్కోవాలా అన్న ఆలోచనతో అతనికిప్పుడు రాత్రుళ్లు నిద్ర పట్టటం లేదు.

* * *

ఏప్రిల్ *1994,*

ఇండియాటుడే